ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేది: 14.06.2026 సమయం:07.05 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు దేశాల పర్యటనలో భాగంగా తొలి దశగా ఫ్రాన్స్ లోని నిస్ నగరానికి చేరుకున్నారు.
2. గత 12 ఏళ్లలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ దేశంలో విద్య, నైపుణ్యం ఆవిష్కరణలు అంకుర పరిశ్రమకు కొత్త సంస్కృతిని అందించారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.
3. రాబోయే 3 – 4 రోజుల పాటు కేరళ, తమిళనాడు, ఈశాన్య ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది.
4. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో నిన్న రాత్రి జరిగిన పురుషుల క్రికెట్ తొలి వన్డే మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

---------------------------------

**PM NICE VISIT**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు దేశాల పర్యటనలో భాగంగా తొలి దశగా ఫ్రాన్స్ లోని నిస్ నగరానికి చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో చర్చలు జరపుతారు. భారత్ ఇన్నోవేట్స్ కార్యక్రమాన్ని సంయుక్తంగా ప్రారంభిస్తారు. ఇది భారత ఆవిష్కరణలు, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను ప్రదర్శించే ఒక ప్రతిష్టాత్మక వేదిక. సాంకేతికత, రక్షణ, ఆవిష్కరణలు, వ్యూహాత్మక వ్యవహారాలతో సహా కీలక రంగాలలో సహకారాన్ని సమీక్షించడానికి ఇరు దేశాల నాయకులు ద్వైపాక్షిక చర్చలు కూడా జరపుతారు. అలాగే కీలకమైన ప్రాంతీయ, ప్రపంచ అంశాలపై అభిప్రాయాలను పంచుకోవడంతో పాటు జి-7 సదస్సులో కూడా పాల్గొంటారు. ఫ్రాన్స్ పర్యటన

ముగిసిన అనంతరం, ప్రధానమంత్రి తన పర్యటనలో రెండవ దశగా స్లోవేకియాకు ప్రయాణమవుతారు.

----------------------------

**PM SLOVAKIA - INDIAN AMBASSADOR**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్లోవేకియా పర్యటన ఇరు దేశాల మధ్య సహకారానికి సరికొత్త మార్గాలను సుగమం చేస్తుందని, అలాగే ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి సహాయపడుతుందని స్లోవేకియాలో భారత రాయబారి అపూర్వ శ్రీవాస్తవ పేర్కొన్నారు. స్లోవేకియా రాజధాని బ్రాటిస్లావాలో ఆకాశవాణి ప్రతినిధితో ఆమె మాట్లాడుతూ....

----------------------------

**TRUMP-PM MODI**

వచ్చే వారం ఫ్రాన్స్ లో జరగనున్న జి-7 సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు ఇతర ప్రపంచ నాయకులతో సమావేశం కానున్నట్లు వైట్ హౌస్ తెలిపింది. ఈ చర్చల్లో ప్రధానంగా ఆర్థిక వృద్ధి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పెట్టుబడి భాగస్వామ్యాలు, పలు ప్రపంచ భద్రతా సవాళ్లపై దృష్టి సారించనున్నట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు. బుధవారం నాడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ - అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ద్వైపాక్షిక సమావేశం జరపుతారు. మిత్రదేశాలు, భాగస్వాములతో సహకారాన్ని బలోపేతం చేసుకుంటూనే, అమెరికా - ఆర్థిక, వ్యూహాత్మక ప్రాధాన్యతలను ముందుకు తీసుకెళ్లడానికి ఈ సదస్సు ఒక మంచి అవకాశాన్ని కల్పిస్తుందని వైట్ హౌస్ పేర్కొంది.

----------------------------

**SHAH PM**

దేశ వ్యాప్తంగా గత 12 ఏళ్లలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ విద్య, నైపుణ్యం ఆవిష్కరణలు అంకుర పరిశ్రమకు కొత్త సంస్కృతిని అందించారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ప్రధానమంత్రి అమలు చేసిన విధానాలతో నేడు భారత్ ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద విద్యా వ్యవస్థ కలిగి ఉందని, కృత్రిమ మేధలో రెండవ అతిపెద్ద మేధో సంపత్తిగా ఉందని, రెండు లక్షల అంకుల పరిశ్రమలతో మూడవ అతిపెద్ద అంకుర పరిశ్రమ వ్యవస్థగా నిలిచిందని అమిత్ షా పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దాదాపు 6 కోట్ల మంది యువత నైపుణ్య అభివృద్ధితో దేశం అపారమైన వృద్ధిని సాధించిందని తెలిపారు. 12 కోట్ల రూపాయల ముద్ర రుణాలు, 300 కు పైగా అంతరిక్ష పరిశ్రమల కల్పనతో, నేటి భారతయువత ఉద్యోగ అన్వేషకులు మాత్రమే కాదని ఉద్యోగల సృష్టికర్తలని అమిత్ షా అన్నారు.

----------------------------

**GADKARI 12 YEARS**

మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు ఉపాధి కల్పనపై రవాణా మంత్రిత్వ శాఖ దృష్టి సారిస్తోందని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం సాధించిన అభివృద్ధి పనులపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గడ్కరీ మాట్లాడుతూ... రోడ్డు, రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ దేశ వ్యాప్తంగా డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసిందని తెలియజేశారు. గత 12 సంవత్సరాల్లో ప్రధానమంత్రి జన్ ధన్ యోజన కింద సుమారు 58 కోట్ల బ్యాంకు ఖాతాలు తెరిచామని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ 60 కోట్ల మంది ప్రజలకు ప్రయోజనం చేకూర్చగా, ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద 11 కోట్ల మందికి ఎల్పిజి కనెక్షన్లు అందజేసినట్లు వెల్లడించారు. పిఎం కిసాన్ సామాన్ నిధి పథకం కింద 11 కోట్ల మంది రైతులు వార్షికంగా ఆర్థిక సహాయాన్ని అనుకుంటున్నారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నాగపూర్ - హైదరాబాద్ ఎక్స్ ప్రెస్ వే రెండు నగరాల మధ్య మూడున్నర గంటల ప్రయాణ సమయాన్ని తగ్గిస్తుందని గడ్కరీ తెలియజేశారు.

----------------------------

**PK MISHRA**

దేశంలోని ప్రధాన నగరాలు ఆర్థికంగా, సుస్థిరమైన పర్యావరణం, సామాజిక సమ్మిళితంగా అధునాతన సాంకేతికతో పటిష్టంగా ఉండాలని ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి PK మిశ్రా అన్నారు. నిన్న న్యూఢిల్లీలోని నిర్వహించిన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ స్వర్ణోత్సవ వేడుకలను ఉద్దేశించి పీకే మిశ్రా ప్రసంగించారు. దేశంలోని పట్టణాల అభివృద్ధి, సంస్థల సామర్ధ్య బలోపేతంలో NIUA కీలకపాత్ర పోషించిందని చెప్పారు. వేగవంతమైన ఆర్థిక అభివృద్ధి, విస్తరిస్తున్న మౌలిక సదుపాయాలు, డిజిటల్ పరివర్తన, ఆవిష్కరణలు పట్టణీకీకరణతో అవకాశాలు సృష్టిస్తున్నందున భారత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని మిశ్రా అన్నారు.

----------------------------

**EVE IMD- WEATHER**

నైరుతి రుతుపవనాలు రాబోయే 2-3 రోజుల్లో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ లోని కొన్ని ప్రాంతాలకు మరింత విస్తరిస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే 3 -4 రోజుల పాటు అండమాన్ నికోబార్ దీవులు, కేరళ, మాహే, ఒడిశా, తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్, ఈశాన్య ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆ శాఖ తెలిపింది. ఈరోజు రాజస్థాన్‌లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిస్తాయని కూడా పేర్కొంది. రాబోయే 3 - 4 రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లద్దాఖ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్, తెలంగాణ, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో పిడుగులు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది.

----------------------------

**CRICKET - IND-AFG ODI**

హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో నిన్న రాత్రి జరిగిన పురుషుల క్రికెట్ తొలి వన్డే మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. 195 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 22.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 84 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్ 24.5 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌట్ అయింది. శుభ్‌మన్ గిల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా మ్యాచ్ ప్రారంభం కావడం ఆలస్యం అవ్వడంతో, 25 ఓవర్ల మ్యాచ్‌గా కుదించారు. భారత్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య రెండో వన్డే మ్యాచ్ ఈనెల 17న లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో జరగుతుంది.

----------------------------